సాక్షి
నిర్మల్

ఆదివారం । 17 । సెప్టెంబర్ । 2023



అతివలకు అండగా సఖి 2లో▸

మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురవుతున్న మహిళలు, యువతులు, బాలికలకు సఖి అండగా నిలుస్తోంది. ఆపదలో ఉన్నవారికి పోలీస్, న్యాయ, వైద్య సాయం అందిస్తోంది.



'భృతి' కోసం పోరాటం

బీడీ కార్మికులందరికీ జీవనభృతి ఇవ్వాలనే నినాదంతో తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌ను శనివారం ముట్టడించారు. 3లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 31.2 /23.3

ఆకాశం కొంతమేర మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. తుపాను ప్రభావంతో అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉంది.



- సాయుధ వీరులు.. ఈ ప్రాంత యోధులు
- నిజాం నిరంకుశ పాలనపై రాజీలేని పోరాటం
- జైలు శిక్షలు.. నిర్బంధాలనూ లెక్కచేయని వారెందరో
- చిరస్మరణీయం వారి పోరాటం
- నేడు తెలంగాణ విమోచన దినోత్సవం

కైలాస్‌నగర్: భూమి కోసం.. భుక్తి కోసం.. నిరంకుశ పాలన విముక్తి కోసం సాగిన తెలంగాణ సాయుధ పోరాటం చరిత్రకు సజీవసాక్ష్యంలా నిలుస్తోంది. ప్రజలను కట్టు బానిసలుగా మార్చి, వారి హక్కులు హరించడం, మహిళలపై ఆకృత్యాలకు ఒడిగట్టడం, రైతుల భూములు లాక్కుని కూలీలుగా మార్చిన నిజాం పాలనలోని రజాకార్ల అరాచకాలు అన్నీఇన్ని కావు. దీంతో విసుగుచెందిన ఎంతో మంది యోధులు ఉద్యమబాట పట్టారు. అరాచక పాలనను ఎదిరించారు. తమ ప్రాణాలు సైతం లెక్క చేయకుండా ఈ ప్రాంత విముక్తే లక్ష్యంగా పోరాడారు. దేశ్‌ముఖ్‌లు, జాగీర్దార్లు, భూస్వాముల కంబంధ హస్తాల్లో చిక్కుకున్న వేలాది ఎకరాలను స్వాధీనం చేసుకుని పేదలకు పంచారు. ఈ క్రమంలో నిర్బంధాలు, జైలు శిక్షలకు వెరవకుండా అలుపెరుగని పోరుతో చరిత్రపుటల్లోకి ఎక్కారు. త్యాగాలకు స్మారకంగా నిర్మించిన స్తూపాలు, ప్రాంతాలు వారి పోరాటాన్ని గుర్తు చేస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో నాటి ఘట్టాలు, పోరాట యోధుల విజయగాథలివి.



వీరులారా.. వందనం

రైతాంగ పోరాటానికి ఆధ్యుడు.. రాంకిషన్ శాస్త్రి



కైలాస్‌నగర్: ఆదిలాబాద్ జిల్లాలో కమ్యూనిస్ట్ పార్టీతో పాటు నిజాం పాలనకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని ప్రారంభించిన వారిలో రాంకిషన్ శాస్త్రి ఆధ్యుడు. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా నల్గొండ జిల్లాలో పనిచేసిన ఆయన సీపీఐ భావజాలానికి ఆకర్షితుడై పార్టీలో చేరాడు. ఈ క్రమంలో ఆయన్ను పార్టీ ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జిగా నియమించింది. 1941లో జిల్లాకు వచ్చిన ఆయన సీపీఐ సభ్యత్వాన్ని ప్రారంభించాడు. కస్తాల రాంకిష్టు, దాజీ శంకర్, వన్నెల ఎల్లన్న, సదాశివ్ వంటి వ్యక్తులతో ఓ ప్రత్యేక దళాన్ని ఏర్పాటు చేశాడు. రైతుల నుంచి భూములను లాక్కుని కౌలు సైతం చెల్లించని రజాకార్ల వైఖరిని ఎండగట్టేలా రైతాంగ పోరాటానికి శ్రీకారం చుట్టాడు. రాత్రి పూట ప్రత్యేక పాఠశాల నడుపుతూ ప్రజలను చైతన్యవంతం చేశారు. 1948లో ప్రస్తుత భీంపూర్ మండలం బెల్సారీ రాంపూర్ గ్రామంలో అరెస్టయిన ఆయన 1952లో విడుదలయ్యారు.

శిక్షణలో దిట్ట.. రాంకిష్టు



కైలాస్‌నగర్: వెట్టిచాకిరీ, పీడిత వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటం చేసిన వ్యక్తి కస్తాల రాంకిష్టు. ప్రజలను పోరాట దిశగా చైతన్యవంతులను చేశాడు. మహారాష్ట్రలోని చనాఖా గ్రామంలో నాడు ఉద్యమకారులకు శిక్షణ ఇచ్చే వ్యవహారాల్లో కీలకపాత్ర పోషించాడు. భూస్వామ్య కుటుంబానికి చెందిన రాంకిష్టు రజాకార్లు సాగించిన హింసాకాండకు చలించి ఉద్యమబాట పట్టాడు. కమ్యూనిస్టు భావజాలానికి ఆకర్షితుడైన ఆయన సీపీఐలో చేరాడు. ప్రజలను సంఘటితం చేసే కార్యక్రమాల్లో క్రియాశీలకంగా వ్యవహరించాడు. రెండేళ్ల జైలు జీవితాన్ని గడిపిన ఆయన విడుదలయ్యాక ఆదిలాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా విజయం సాధించాడు.

పోరుబాటలో బోథ్ బిడ్డలు

బోథ్: తెలంగాణలో సాయుధ పోరాటంలో బోథ్ చరిత్ర ఘనమైనది. ఈ ప్రాంతానికి చెందిన చట్ల శంకర్‌రావు, తక్కల చరణ్‌దాస్‌రెడ్డి, గుండెరావు, బొందిడి వెంకట్రావ్, ఎస్.లింగారెడ్డి, లక్ష్మణ్‌రావ్ సూర్య, పూంద్రు రాజిరెడ్డి, ప్రభాకర్‌రావ్‌తో పాటు చాలామంది సాయుధ పోరాటంలో పాల్గొన్నారు.

ఆర్నెళ్లు జైలులో చరణ్‌దాస్



నాడు రజాకార్లను గట్టిగా ఎదుర్కొన్న వారిలో తక్కల చరణ్‌దాస్‌రెడ్డి ఒకరు. మహారాష్ట్రలో సాయుధ శిక్షణ పొంది ఉద్యమంలో తన వంతు పాత్ర పోషించాడు. 2015లో మృతి చెందాడు.

శిక్షణలో రాటుదేలిన 'బొందిడి'



ఆదిలాబాద్‌కు చెందిన కస్తాల రాంకిష్టు, మరో 30 మందితో కలిసి ఈయన చంద్రాపూర్‌లో సాయుధ శిక్షణ పొందాడు. రజాకార్లపై దాడులు చేయడంలో కీలకపాత్ర పోషించాడు. స్వాతంత్య్రం అనంతరం వివాహం చేసుకున్నాడు. 1998లో మృతి చెందాడు.

నిజాంను కలిసి 'చట్ల' నిరసన



నాటి రజాకార్ల ఆగడాలు సహించలేక హైదరాబాద్‌లో నిజాంను కలిసి తన నిరసన తెలిపాడు చట్ల శంకర్‌రావు. ఈ క్రమంలో ఈయనను జైలులో బంధించాలని నిజాం ఆదేశించారు. దీంతో ఈయన 1947లో ఆసిఫాబాద్‌లో జైలు జీవితం గడిపారు.

పోరాటానికి గుర్తింపుగా స్తూపాలు, కాలనీలు

కైలాస్‌నగర్: సాయుధ రైతాంగ యోధుల పోరాటాలకు గుర్తుగా కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక స్తూపాలను నిర్మించారు. కాలనీలనూ ఏర్పాటు చేశారు. కలెక్టరేట్‌లో సాయుధ పోరాట యోధుల పేర్లతో ప్రత్యేక శిలాఫలకం ఏర్పాటు చేశారు. కాస్తాల రాంకిష్టు పేరిట కేఆర్‌కే కాలనీ, దాజీ శంకర్ పేరిట పెండల్వాడలో ఓ కాలనీ ఏర్పాటు చేశారు. అలాగే తాంసి మండలం ఈదుల్లాసావర్గాంలో దాజీ శంకర్, తిర్పెల్లి శ్మశాన వాటికలో కస్తాల రాంకిష్టు, భుక్తాపూర్‌లో రాంకిషన్ శాస్త్రీ స్తూపాలను నిర్మించారు.

ఆసిఫాబాద్ యోధులు

ఆసిఫాబాద్: నిజాం నిరంకుశ పాలన అంతమొందించేందుకు జరిపిన సాయుధ పోరాటంలో ఆసిఫాబాద్ సమరయోధుల పాత్ర కీలకమైనది. ఇండియన్ యూనియన్‌లో కలవడానికి ఈ ప్రాంత వాసులు అత్యంత కీలక పాత్ర పోషించారు. ఆసిఫాబాద్, సిర్పూర్‌కు చెందిన వేలాది మంది యువకులు కాంగ్రెస్ అతివాద నాయకుల నేతృత్వంలో 1947 సెప్టెంబర్ నుంచి నిజాం వ్యతిరేక పోరాటంలో దిగారు. పట్టణానికి చెందిన బోనగిరి వెంకటేశం, తాటిపెల్లి తిరుపతి, చీల శంకర్, చీల విఠల్, ఏకబిల్వం నాగేంద్రయ్య, ఖాడ్రే శంకర్, రాంసింగ్, రేవయ్య, తాటిపెల్లి తిరుపతి, ఏకబిల్వం శంకరయ్య, చందావార్ విఠల్, చిలుకూరి సీతారాం, జగన్నాథ్‌తో పాటు పలువురు యోధులు అజ్ఞాతంలోకి వెళ్లి మహారాష్ట్రలోని చాందా సాయుధ శిక్షణా శిబిరంలో ఏడాది పాటు శిక్షణ పొందుతూ వివిధ ఘటనల్లో పాల్గొన్నారు. వీరి ఉద్యమాలకు ఆసిఫాబాద్‌కు చెందిన రాంచందర్ రావు పైకాజి, సుబ్బారావు, దండనాయకుల గోపాల్‌కిషన్‌రావు, వామన్ రావు వైరాగరే, ప్రభాకర్ రావు మసాదే పరోక్షంగా సహకరించారు. వీరూర్ రైల్వేస్టేషన్ విధ్వంసం చేసిన ఘటన బోనగిరి వెంకటేశం కాలికి గ్రేనేడ్ తగిలి ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. నాటి పోరాటంలో పాల్గొన్న వారిని ప్రభుత్వం స్వాతంత్ర్య సమరయోధులుగా గుర్తించింది.



సాయుధ పోరాటంలో పాల్గొన్న యోధులు (ఫైల్)

నాడు పోరాట.. నేడు పర్యాటక కేంద్రం

చెన్నూర్: నాడు నిజాం సర్కారుపై సమరం సాగించేందుకు కేంద్ర బిందువుగా ఉన్న అద్దాల మేడ నేడు పర్యాటక కేంద్రంగా మారింది. 1901బ్రిటిష్ కాలంలో అప్పటి కలెక్టర్ గ్లాస్‌ఫోర్డ్ తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దులోని సిరొంచ ప్రాణహిత నది ఒడ్డున అద్దాల మేడను నిర్మించారు. ఆ మేడను ఇండియన్ మిలిటరీ సైనికులు స్థావరంగా ఏర్పర్చుకుని నిజాం సర్కార్‌పై పోరు సాగించారు. ఆనాటి అద్దాల మేడ నేటికీ చెక్కు చెదరలేదు. తెలంగాణ, మహారాష్ట్ర నుంచే కాకుండా ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి పర్యాటకులు వస్తుంటారు.



మహారాష్ట్రలోని సిరొంచలో ఉన్న అద్దాల మేడ

జిల్లాకు అనుబంధం..

మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం రాపన్‌పల్లికి మూడు కిలోమీటర్ల దూరంలోని ప్రాణహిత నది అవతలి ఒడ్డున సిరొంచలో ఉన్న అద్దాల మేడతో జిల్లా వాసులకు అనుబంధం ఉంది. ఆనాటి మద్రాసు ప్రెసిడెన్సీలో అప్పర్ గోదావరి జిల్లా కేంద్రంగా సిరొంచ ఉండేది. సిరొంచ జిల్లా పరిధిలో అప్పటి ఏపీలోని భద్రాచలం, ఖమ్మం, ఏటూరునాగారం, కరీంనగర్, మరోవైపు జన్నారం, లక్సెట్టిపేట వరకు విస్తరించి ఉంది. స్వాతంత్ర్యం అనంతరం రాష్ట్రాల విభజన తర్వాత భద్రాచలం, ఖమ్మం, ఏటూరునాగారం, కరీంనగర్, జన్నారం, లక్సెట్టిపేట ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కలిపారు. సిరొంచ మహారాష్ట్రలో భాగమైంది.

విశేషాలు..

- అద్దాల మేడ మూడంతస్తుల భవనం పైనుంచి చుట్టూ 15 కిలోమీటర్ల మేర కన్పిస్తుండడంతో శత్రువుల రాకను సైనికులు కనిపెట్టేవారు.
- భవనం లోపలి నుంచి సుమారు 10 కిలోమీటర్ల మేర సొరంగం ఉండేది. దీని ద్వారానే సైనికులకు ఆయుధాలు చేరుతుండేవని ప్రచారంలో ఉంది. ఇక్కడి నుంచి పోరాడిన ఇండియన్ మిలిటరీ సైనికుల్లో సుమారు 211 మంది స్వాతంత్ర్య సంగ్రామంలో తుది శ్వాస విడువగా వేలాది మంది రజాకార్లను మట్టి కరిపించారు.
- చెన్నూర్, నస్పూర్, కోటపల్లి మండలాల స్వాతంత్ర్య సమరయోధులు ఇండియన్ మిలిటరీ సైనికులకు రజాకార్ల కదలికలపై సమాచారం చేరవేసే వారని ప్రచారంలో ఉంది.

గవర్నర్ బస..

1947లో మద్రాసు గవర్నర్ పట్టాభి సీతారామయ్య ఈ భవనంలో బస చేశారు. హైదరాబాద్ నిజాం సర్కార్‌తో చర్చలు జరుపడానికి అప్పటి హోంశాఖ మంత్రి వల్లభాయ్ పటేల్ అద్దాల మేడకు వచ్చినట్లు సమాచారం. పీవీ నరసింహారావు సైతం అద్దాల మేడను సందర్శించిన ప్రముఖుల్లో ఉన్నారు.

ఉద్యమ శిఖరం.. కొండా లక్ష్మణ్



ఆసిఫాబాద్: నిజాం నిరంకుశ పాలనపై కొండా లక్ష్మణ్ బాపూజీ అలుపెరుగని పోరాటం చేశారు. ఆయన స్వస్థలం అప్పటి హైదరాబాద్ సంస్థానం ప్రస్తుత మహారాష్ట్రలోని రాజూర. పౌర విమోచనోద్యమంలో 1938లో తొలిసారి అరెస్టయ్యారు. 1941–42లో ఖద్దరు, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొన్నారు. 1947లో కింగ్‌కోఠి నుంచి బయటకు వచ్చిన నిజాం నవాబుపై బాంబులు విసిరిన ఘటనలో నిందితుడిగా ఉన్నారు. హైదరాబాద్ సంస్థాన్‌ను విలీనం చేయాలనే ఉద్యమంలో భాగంగా 13 సార్లు అరెస్టయ్యారు.

దళాల స్పెషలిస్ట్.. శంకర్



కైలాస్‌నగర్: రజాకార్లు సాగించిన వెట్టిచాకిరీ, రైతులను పీడించిన ఘటనలతో విసుగుచెందిన దాజీ శంకర్ వాటిని వ్యతిరేకిస్తూ ఉద్యమబాట పట్టాడు. కుచులాపూర్, తాంసి, తలమడుగు, ఆదిలాబాద్ మండలాల్లో పర్యటిస్తూ ప్రత్యేక దళాలను ఏర్పాటు చేశాడు. ఈయన పోరాట పంథాపై నిజాం పాలకుల నిఘా పెరగడంతో అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. రెండేళ్ల పాటు అజ్ఞాతం నుంచే ప్రజల ద్వారా పోరాటాన్ని నడిపించాడు. తన సొంత భూమి 350 ఎకరాలను పేదలకు పంచి సామాజిక బాధ్యతనూ చాటుకున్నాడు. 1947లో అరెస్టయి జైలుకు వెళ్లిన ఆయన 1952లో విడుదలయ్యాడు. అదే ఏడాది జరిగిన ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేసి ఘన విజయం సాధించారు.

జాగృతం చేసిన ఎల్లన్న



కైలాస్‌నగర్: రజాకార్లు సాగిస్తున్న దమనకాండకు వ్యతిరేకంగా ప్రజలను జాగృతం చేయడంలో తాంసి మండల కేంద్రానికి చెందిన వన్నెల ఎల్లన్న కీలక పాత్ర పోషించాడు. కళాకారుడైన ఆయన సీపీఐలో చేరి తన ఆటపాటల ద్వారా గ్రామగ్రామాన జనాన్ని పోగు చేసేవాడు. పోరుబాటలో అరెస్టయి జైలు జీవితం సైతం గడిపాడు.

ఆశ్రయం ఇచ్చిన లంబాడితండా

బెల్లంపల్లి: నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా, రజాకార్ల దాష్టీకాలపై పోరాటం సాగించిన తెలంగాణ రైతాంగ సాయుధ యోధులకు బెల్లంపల్లి మండలం లంబాడితండా ఆశ్రయమిచ్చింది. ఊరు ఊరంతా గుట్టు బయటపడకుండా గుండెల్లో దాచుకుంది. 1947 ప్రాంతంలో లంబాడితండా గ్రామం సుమారు వంద కుటుంబాలు 400 పైచిలుకు జనాభా కలిగి ఉండేది. సింగరేణి కార్మికులు, రైతులు, దినసరి కూలీల కలబోతగా ఉండేది. కమ్యూనిస్టు యోధులు బాసెట్టి గంగారాం, జె.కుమారస్వామి, పోతుగంటి పోశెట్టి తదితరులు బెల్లంపల్లి ప్రాంతాన్ని రహస్య స్థావరంగా ఏర్పాటు చేసుకుని సాయుధ పోరాటం చేశారు. గ్రామానికి చెందిన సుకాసి బాలయ్య, సుకాసి పోశం, సల్లం పోశం తదితరులు సాయుధ పోరాట వీరులకు నమ్మిన బంట్లుగా వ్యవహరించారు. జన్నారం, ఆసిఫాబాద్, ఉట్నూర్, లక్సెట్టిపేట, చెన్నూర్, సిర్పూర్(టి) తదితర ప్రాంతాల్లో భూ పోరాటాలు చేసి పేదలకు భూములు పంచారు. కుమురంభీం ఆచూకీని ఇన్‌ఫార్మర్ మాడావి కొద్దు పోలీసులకు అందించినట్లు కమ్యూనిస్టు దళం గుర్తించింది. అగ్ర నాయకత్వం ఆదేశాలతో తిర్యాణి ప్రాంతంలో అంతమొందించింది.



దళ నాయకులకు ఆశ్రయం ఇచ్చిన ఇల్లు (ఫైల్)

ప్రస్తుతం లంబాడితండా గ్రామం..

లంబాడితండా గురిజాల గ్రామ పంచాయతీలో అనుబంధ గ్రామంగా ఉండగా 2019లో గ్రామ పంచాయతీగా ఏర్పడింది. రెండేళ్ల క్రితం వరకు కమ్యూనిస్టు దళ నాయకులు ఆశ్రయం పొందిన ఓ ఇల్లు అప్పటి ఆనవాళ్లకు గుర్తుగా ఉండేది. అప్పటి తరం అంతరించడం, ఎదిగిన కొడుకులు ఉద్యోగం, బతుకు దెరువు వెతుక్కుంటూ ఇతర ప్రాంతాలకు వలస వెళ్లడంతో మట్టిగోడలు కూలిపోయి ఆనవాళ్లు లేకుండా పోయింది. గ్రామంలో కొందరు సింగరేణి కార్మికులు ఉండగా అనేక మంది వ్యవసాయ రైతులుగా, కూలీలుగా జీవిస్తున్నారు. పాల వ్యాపారం చేస్తున్నారు.

గాండ్రించిన నిర్మల్ గడ్డ..

- నిజాంకు వ్యతిరేకంగా ఉద్యమం
- 70 మందిని జైళ్లో పెట్టిన రజాకార్లు



తెలంగాణ విముక్తి కోసం పోరాడిన సమరయోధులు (ఫైల్)

నిర్మల్:ప్రథమ సాతంత్ర్య సంగ్రామానికి కొనసాగింపుగానే నిర్మల్‌గడ్డ గాండ్రించింది. సాధారణ ఆదివి బిడ్డలు రాంజీగోండు సారథ్యంలో నాటి పాలకులపై అసాధారణంగా పోరాడారు. చివరకు ఆ వెయ్యిమంది పోరువీరులు ఒకే మర్రిచెట్టుకు ఉరితీయబడ్డారు. నాటివీరుల ప్రాణత్యాగాల స్ఫూర్తితో తెలంగాణ విముక్తి కోసం సమరయోధులు కదంతొక్కారు.నైజాం, ఆంగ్లేయులతో పోరాడుతూ.. ఇళ్లు, పిల్లలకే కాదు ఏకంగా ఊళ్లకే దూరమయ్యారు. నెలల తరబడి ఎక్కడో దూరంగా ఉన్న జైళ్లల్లో మగ్గారు. తిండీతిప్పల్లేక లాఠీదెబ్బలు తిన్నారు.

నిజాం పాలనపై తిరుగుబాటు..

ఓవైపు దేశానికి 1947, ఆగస్టు 15నే స్వాతంత్ర్యం వచ్చినా మన తెలంగాణ ప్రాంతం మాత్రం నిజాం నిరంకుశత్వంలోనే 13 నెలలు మగ్గింది. ఈ కాలంలో జిల్లాకు చెందిన సమరయోధులు సంఘటితంగా నిజాం, రజాకార్ల ఆగడాలపై పోరు జరిపారు. నాటి నిర్మల్ పంచాయతీ సమితి పరిధిలో గోపిడి గంగారెడ్డి, గణపతి, బాపూరావు, బోరేగాం గజన్న, లాలు పటేల్, ఏ.రాజన్న, పోశెట్టి, గంగాధర్, శివన్న, గంగారామ్, విఠల్‌రావు, జమునాలాల్, వెంకోబరావు, గాంధారి చిన్న నర్సింహులు,లింగారెడ్డి, సుందర్‌రాజ్, ముడుసు ఎల్లయ్య, అర్గుల గంగాధర్‌గుప్తా, హన్మంతరావుఠాకూర్.. ఇలా ఎంతోమంది సమరయోధులు పోరాడారు.

జైళ్లలో మగ్గి..

నిజాంపై పోరాటంలో నిర్మల్, భైంసా ప్రాంతాల్లో కలిపి వందకుపైగా సమరయోధులు ఉండేవారు. ఇందులో 73 మందిని గుర్తించి జైళ్లకు పంపించారు. మహారాష్ట్రలోని నాందేడ్, చంద్రాపూర్, ఔరంగాబాద్, నిజామాబాద్ వంటి దూర ప్రాంత జైళ్లలో ఉంచారు. 1948, సెప్టెంబర్ 17న పటేల్ సైన్యానికి నిజాం లొంగిపోయిన తర్వాతే ఇళ్లకు చేరారు.

మట్టి గణపతిని పూజించాలి

నిర్మల్‌టౌన్: పర్యావరణ పరిరక్షణ, వాతావరణం, నీటి కాలుష్యం కాకుండా గణపతి నవరాత్రి ఉత్సవాల్లో మట్టి గణపతిని పూజించాలని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి కోరారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో తయారుచేసిన మట్టి గణపతి ప్రతిమలను శని వారం పంపిణీ చేశారు. అంతకుముందు మంత్రి క్యాంపు కార్యాలయంలో ఐకేఆర్ ట్రస్ట్, క్లీమమ్ వ్య వస్థాపకురాలు అల్లోల దివ్యారెడ్డి ఆధ్వర్యంలో త యారుచేసిన గోమయ గణపతి ప్రతిమలను కుటుంబ సభ్యులతో కలిసి పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలను తయారుచేసి ఉచితంగా పంపిణీ చేస్తుందని తెలిపారు. నిర్మల్ నియోజకవర్గంలో 20 వేల మట్టి గణపతి విగ్రహాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో క్లీమమ్ వ్యవస్థాపకురాలు అల్లోల దివ్యారెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక రమణ, ఎఫ్ఏసీఎస్ చైర్మన్ రాజేందర్, సోన్ జెడ్పీటీసీ జీవన్‌రెడ్డి, కాల్వ ఆలయ చైర్మన్ మహేశ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రాము పాల్గొన్నారు.



గోమయ గణపతిలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, క్లీమమ్ వ్యవస్థాపకురాలు దివ్యరెడ్డి

మట్టి వినాయకులే శ్రేష్టం

నిర్మల్‌చైన్‌గేట్: మట్టి వినాయకులను పూజించడమే శ్రేష్టమని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. మహిళా ప్రగతి జిల్లా సమైక్య రూరల్ మార్ట్ ద్వారా తయారు చేసిన పర్యావరణ హిత బీజమట్టి గణపతి విగ్రహాలను సమీకృత కలెక్టరేట్‌లో కలెక్టర్, ఎస్పీలతో కలిసి పంపిణీ చేశారు.

పండుగ ప్రశాంతంగా జరుపుకోవాలి

నిర్మల్‌చైన్‌గేట్: గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి సూచించారు. కలెక్టరేట్ సమావేశమందిరంలో కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ఎస్పీ ప్రవీణ్‌కుమార్, అదనపు కలెక్టర్, డీఎస్పీ, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వినాయక చవితి సందర్భంగా ఈ నెల 18 నుంచి 28 వరకు అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. నిమజ్జనం కూడా ప్రశాంతంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

ప్రతీపౌరుడు ఓటరుగా నమోదు చేసుకోవాలి

- ఎలక్ట్రోరల్ అబ్జర్వర్ అహ్మద్‌నదీం

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో 18 ఏళ్లు నిండిన ప్రతీ పౌరుడు ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని ఎలక్ట్రొరల్ అబ్జర్వర్ అహ్మద్‌నదీం అహ్మద్ నదీం అన్నారు. ఎలక్షన్ సెకండ్ సమ్మరీ రివిజన్‌లో భాగంగా సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్మల్ కలెక్టర్ వరుణ్‌రెడ్డి, మంచిర్యాల కలెక్టర్ సంతోష్, నిర్మల్ అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, మంచిర్యాల అదనపు కలెక్టర్ రాహుల్ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నదీం మాట్లాడుతూ ఓటరు జాబితాలో మార్పులు చేర్పులు కొత్త ఓటర్ నమోదుకు మూడు రోజులే సమయం ఉన్నందున ఈఆర్వోలు ప్రణాళిక ప్రకారం ముందుకు సాగాలన్నారు. ఇందుకోసం ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా ద్వారా ప్రజలకు అవగాహన కల్పించే ప్రయత్నం చేయాలని సూచించారు. గడువు సమీపిస్తున్నందున చివరి నిమిషంలో ఎక్కువ మొత్తంలో దరఖాస్తులు వచ్చి ఇబ్బంది ఏర్పడకుండా క్షేత్రస్థాయిలో పర్యటించి బీఎల్‌వోల ద్వారా పని సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. పెళ్లిళ్లు అయి చిరునామా మారిన వారిని గుర్తించి వారికి కొత్త చిరునామాలో ఓటు హక్కు కల్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. చనిపోయిన, వలస వెళ్లిన వారి ఓటు హక్కు నుంచి తొలగించే కార్యక్రమం పకడ్బందీగా జరగాలన్నారు. నిర్మల్ కలెక్టర్ వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ ఓటు హక్కుపై చైతన్యం కలిగించేలా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. అంతకుముందు అహ్మద్ నాదీమ్ అటవీ శాఖ గెస్టహౌస్‌లో కలెక్టర్ వరుణ్‌రెడ్డి కలిసి పూల మొక్క అందజేశారు.కార్యక్రమంలో నిర్మల్, మంచిర్యాల ఆర్డీవోలు, తహసీల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎలక్ట్రోరల్ అబ్జర్వర్ అహ్మద్ నదీమ్

చట్టాలపై అవగాహన ఉండాలి

- జిల్లా సీనియర్ సివిల్ జడ్జి అజేశ్‌కుమార్



అవగాహన కల్పిస్తున్న జడ్జి అజేశ్‌కుమార్

నిర్మల్‌టౌన్: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి అజేశ్‌కుమార్ సూచించారు. జిల్లా కేంద్రంలోని సిద్దార్థ వొకేషనల్ కళాశాల విద్యార్థులకు చట్టాలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చట్టాలపై అవగాహన కల్పించారు. సైబర్ చట్టాలు, యాసిడ్ దాడులు, బాల్య వివాహాలు, గృహహింస చట్టం, నిర్వహణ చట్టం, ట్రైబల్ రైట్స్‌కు సంబంధించిన న్యాయ సేవలను వివరించారు. కార్యక్రమంలో నిర్మల్ చీఫ్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ రాజలింగం, న్యాయవాదులు లింగగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

19న సమావేశం

ఆదిలాబాద్‌రూరల్: ఆదివాసీలు కొన్నేళ్లుగా ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించేందుకు ఈ నెల 19న జిల్లా కేంద్రంలోని పిట్టల్‌వాడలోని ఆదివాసీ భవనంలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుం దెబ్బ) ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ సమితి జిల్లా అధ్యక్షుడు గోడం గణేష్ తెలిపారు. ఈ సమావేశంలో లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని, జీవో ఎంఎస్ 3ని యథావిధిగా కొనసాగించాలని, ఏజెన్సీ డీఎస్సీని ఏర్పాటు చేయాలని, పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, జిల్లా కేంద్రంలో నివాసం ఉంటున్న ఆదివాసీలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని, తదితర అంశాలపై చర్చించడం జరుగుతుందన్నారు. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలోని ఆదివాసీ హక్కుల పోరాట సమితి అనుబంధ సంఘాలు, ఆదివాసీ మేధావులు, నిరుద్యోగులు, ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కాలేజ్ ఆఫ్ డిఫెన్స్ మేనేజ్‌మెంట్‌లో ఆర్జీయూకేటీ వీసీ



అధికారులతో మాట్లాడుతున్న వీసీ

భైంసా: హైదరాబాద్‌లోని కాలేజ్ ఆఫ్ డిఫెన్స్ మేనేజ్‌మెంట్‌తో నిర్వహించిన సమావేశంలో బాసర ఆర్జీయూకేటీ వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ పాల్గొన్నారు. శనివారం జరిగిన ఈ సమావేశంలో డిఫెన్స్ కాలేజీ కమాండర్ సంజయ్‌దత్‌తో పాటు పలువురు సీనియర్ అధికారులతో చర్చించారు. డిఫెన్స్ అకాడమితో బాసర ఆర్జీయూకేటీ అనుసంధానించే అవకాశాలను పరిశీలించినట్లు వీసీ తెలిపారు.

హక్కుల సాధనకు ఏకమవ్వాలి

ఇంద్రవెల్లి: ఏజెన్సీలో నివసిస్తున్న గిరిజనేతరుల న్యాయమైన హక్కుల సాధనకు ఏకం కావాలని ఏజెన్సీ గిరిజనేతరుల హక్కుల పోరాట కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు భారత్ వాగ్మరే అన్నారు. శనివారం సాయంత్రం మండల కేంద్రంలోని ఫంక్షన్ హాల్‌లో ఏజెన్సీ గిరిజనేతరుల హక్కుల పోరాట కమిటీ ఆధ్వర్యంలో సమావేశమయ్యారు. 1/70 చట్టానికి కంటే ముందు నుంచే ఏజెన్సీలో గిరిజనేతరులు నివసిస్తున్నారని, వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ఏజెన్సీ గిరిజనేతరుల హక్కుల సాధన కమిటీ జిల్లా అధ్యక్షుడు జాడే నాగోరావ్ ఉన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు



బెల్లం పానకాన్ని ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

పెంబి: మండలంలోని పెంబితండా, ఇటిక్యాల్‌తండా, లోతర్యతండా, తాటిగూడ గ్రామాల్లో ఎక్సైజ్ సీఐ రంగస్వామి ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. గుడుంబా తయారు చేయడానికి సిద్ధంగా ఉన్న 400 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. అనంతరం ఆయా గ్రామాల్లో నిషేధిత గుడుంబాపై అవగాహన కల్పించారు. గుడుంబా తయారు చేసినా, విక్రయించిన కఠినమైన కేసులు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై రమేష్, సిబ్బంది ముత్యం, రషీద్, కల్పన, మధు, కమలాకర్, గౌతమ్, వెంకటేష్, ఇర్ఫాన్ ఉన్నారు.

అతివలకు అండగా.. సఖి

- 24గంటలు అందుబాటులో సేవలు
- విస్తృతంగా అవగాహన సదస్సులు
- బాధితులకు చేయూత



గ్రామంలో అవగాహన కల్పిస్తున్న సఖి బృందం



"జిల్లాలోని పేదింటి యువతిని.. బాగా ఆస్తి ఉన్న యువకుడు ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. కొన్ని రోజులు ఇద్దరూ బాగానే ఉన్నారు. పాప పుట్టిన తర్వాత కట్న కానుకల కోసం మరో వివాహం చేసుకోవాని ఆలోచన చేశాడు. ఈ క్రమంలో సైకోలా ప్రవర్తిస్తూ భార్యని పుట్టింటికి పంపించి విడాకులు ఇవ్వాలని ఒత్తిడి చేశాడు. దీంతో బాధితురాలు సఖి కేంద్రాన్ని సంప్రదించింది. సఖి సిబ్బంది వారి గ్రామానికి వెళ్లి పెద్దలను కూర్చోబెట్టి అర్థమయ్యేలా చెప్పి వచ్చారు. రెండుసార్లు కేంద్రానికి పిలిపించి తను బతకడానికి ఆధారం చూపించమని గట్టిగా అడిగి కౌన్సెలింగ్ ఇవ్వడంతో భార్యతో కలిసి ఉండేందుకు అంగీకరించాడు."



"ఐదు నెలల క్రితం జిల్లాకు చెందిన ఓ జంటకు పెద్దలు కట్న కానుకలతో ఘనంగా వివాహం చేశారు. నెల రోజులు కాపురం సజావుగా సాగింది. తర్వాత ఆడబిడ్డ, అత్త, భర్త వివిధ కారణాలతో హింసించడం మొదలుపెట్టారు. దీంతో బాధితురాలు సఖి కేంద్రాన్ని ఆశ్రయించింది. సఖి నిర్వాహకులు వారి ఇంటికి వెళ్లి బాధితురాలికి అండగా నిలిచారు. భర్తతోపాటు, అత్త, ఆడబిడ్డను సఖి కేంద్రానికి పిలిపించి మూడుసార్లు కౌన్సెలింగ్ నిర్వహించారు. వరుస కౌన్సెలింగ్‌తో వారి ప్రవర్తనలో మార్పు వచ్చింది. కాపురం నిలబడింది."

నిర్మల్‌టౌన్: కుటుంబంలో,పనిప్రదేశం.. ఇతర చోట్ల మహిళలు, యువతులు, బాలికలు మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురవుతున్నారు. అలాంటి వారికి మేమున్నామంటూ అండగా నిలుస్తోంది సఖి కేంద్రం. బాధితులకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తూ అండగా ని లుస్తోంది. వేధింపులకు గురై బయటకు చెప్పుకో లేని మహిళలు, బాలికలకు మనోధైర్యం కల్పించేందుకు పోలీస్, న్యాయ సహాయం అందిస్తోంది.

2019లో ఏర్పాటు..

జిల్లాలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సఖి కేంద్రాన్ని 2019, మే 18న ఏర్పాటు చేసింది. వ్యక్తిగత సమస్యలతో వచ్చేవారికి న్యాయపరమైన సూచనలు ఇవ్వడంతో పాటు అన్ని రకాల సేవలను అందిస్తున్నాయి. న్యాయ, వైద్య, పోలీసుశాఖల సమన్వయంతో ఈ సేవలను ఉచితంగా అందిస్తున్నాయి. సలహా, రక్షణే లక్ష్యంగా కౌన్సెలింగ్, న్యాయసేవలు, కేసు నమోదు, పోలీసుల సహాయం, వైద్య సేవలు, తాత్కాలిక వసతి వంటి సేవలను అందిస్తున్నాయి. హింస, వేధింపుల నుంచి బయటపడేలా భరోసా కల్పిస్తుంది.

సెంటర్‌లో లభించే సేవలు..

హింస వేధింపుల బారినపడిన వారికి నేషనల్ హెల్త్‌మిషన్, పోలీసులతో అత్యవసర సేవలందించడం, వారిని కాపాడిన తర్వాత ఆశ్రయం కల్పించడం, బాధితులకు వైద్య సేవలు అందించేందుకు సమీప ఆసుపత్రులకు పంపించడం వంటి సేవలను సఖి కేంద్రాలు అందిస్తున్నాయి. తాత్కాలికంగా బాధితులకు ఐదు రోజులు వసతి కల్పిస్తాయి. బాధితులు కోర్టు ప్రొసీడింగ్‌కు హాజరు కాలేని పరిస్థితుల్లో, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోర్టులో తమ వాదనలు వినిపించే సౌకర్యాన్ని సైతం కల్పిస్తారు.

హెల్ప్‌లైన్..181

సఖి కేంద్రాలకు రాలేని మహిళల కోసం హెల్ప్‌లైన్‌ను సైతం ఏర్పాటు చేశాయి. సమస్యల్లో ఉన్న మహిళలు టోల్ ఫ్రీ నంబర్ 181లో సంప్రదించవచ్చు. ఇది 24/7 అందుబాటులో ఉంటుంది. ఏసమయంలోనైనా బాధితులు ఫోన్ ద్వారా సంప్రదిస్తే ఓ వాహనం వారు ఉన్న ప్రదేశానికి వస్తుంది. ఈ వాహనంలో ఒక మహిళా కానిస్టేబుల్‌తో పాటు సైక్రియాటిస్ట్ ఉంటారు. వీరు బాధితురాలికి భరోసా ఇస్తూ సఖి కేంద్రాలకు తీసుకెళ్తారు.

సఖి కేంద్రంలో నమోదైన కేసుల వివరాలు..

మొత్తం కేసులు	1121
గృహహింస	845
వరకట్న వేధింపులు	29
బాల్య వివాహాలు ఆపిన కేసులు	15
ప్రేమ వేధింపులు, సైబర్ క్రైం	75
డీఐఆర్ కేసులు	13
వైద్యసాయం	53
ఆశ్రయం కల్పించినవి	271
రెస్క్యూ చేసినవి	25
లీగల్ కౌన్సెలింగ్	85
ఫోక్సో కేసులు	22
ఎఫ్ఐఆర్ నమోదైనవి	37
పరిష్కరించినవి	980
విచారణలో ఉన్నవి	141

వెల్‌కమ్ కిట్లు..

కట్టుబట్టలతో సఖి కేంద్రానికి వచ్చే వారికి ఆశ్రయం, భోజన వసతి కల్పించడమే కాకుండా రాష్ట్ర ప్రభుత్వం రూ.2వేల విలువైన 28 రకాల వస్తువులతో కూడిన వెల్‌కమ్ కిట్లు అందిస్తుంది. ఇందులో లగేజ్ బ్యాగ్, సారీస్, పెటికోట్, లైనింగ్ పాల్స్, టాప్స్, లెగ్గింగ్స్, చున్నీస్, పాంటీస్, ఫేస్ క్రీం, పౌడర్, అద్దం, నూనె, గాజులు, టూత్ పేస్ట్, టూత్ బ్రష్, బాడీసోప్, డిటర్జెంట్ సోప్, టిక్లీస్, న్యాప్‌కిన్స్, డిటర్జెంట్ పౌడర్, టవల్, ఖర్చీఫ్, షాంపూస్, స్లిప్పర్స్, హెర్ బ్యాండ్, నైటీస్ ఉంటాయి. ఇప్పటివరకు 82 మందికి వెల్‌కమ్ కిట్లు అందించారు.

'సఖి'పై విస్తృత ప్రచారం...

అత్యాచారాలు, వేధింపులు, లైంగిక దాడులు, ఇతర ఘటనలపై ఎక్కడ ఎలా ఫిర్యాదు చేయాలో తెలియని గ్రామీణ, పట్టణ మహిళలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. ఇలా ఇప్పటి వరకు జిల్లాలోని 19 మండలాల్లోని 396 గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యంగా స్కూళ్లు, కాలేజీలు, ఆరోగ్య కేంద్రాలు, పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులు, షాపింగ్‌మాల్స్, సూపర్ మార్కెట్లు, మండల, జిల్లా సమాఖ్య సంఘాల సమావేశాలు.. ఇలా మహిళలు ఉండే ప్రదేశాల్లో సఖి సేవల గురించి వివరిస్తున్నారు.

బాధితులకు అండగా..



మహిళలు, బాలికలు హింసకు, వేధింపులకు గురైతే 181 కు సమాచారం అందించాలి. తక్షణమే స్పందించి వారికి అండగా నిలుస్తాం. మహిళలకు రక్షణ కల్పించే అన్నిరకాల సేవలు సఖి కేంద్రంలో అందుబాటులో ఉన్నాయి. అవగాహన లేక చాలామంది సఖి కేంద్రాలకు రాలేకపోతున్నారు. మహిళలు, బాలికలు తమ సమస్యలను చెప్పుకునేలా విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం.

–మమత, సఖి కేంద్రం నిర్వాహకురాలు, నిర్మల్

కడెం కుడి కాలువకు గండి



కాలువకు గండిపడడంతో వృథాగా పోతున్ననీళ్లు

కడెం: కడెం ప్రాజెక్ట్ ఆయకట్టు కుడి కాలువకు కడెం సమీపంలో కుండీల వద్ద గండి పడదంతో సాగు నీరంతా వృథాగా పోతోంది. మూడేళ్లుగా ఇదే చోటా గండిపడడంతో ఇరిగేషన్ అధికారులు తాత్కాలిక మరమ్మతులతో చేతులు దులుపుకోవడంతో ఇబ్బందులు తప్పడం లేదని ఆయకట్టు రైతులు వాపోతున్నారు. గండిపడిన చోట ఇసుక బస్తాలతో తాత్కాలిక మరమ్మతులు చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

దిమ్మదుర్తిలో అంబేద్కర్ విగ్రహం ధ్వంసం



ధ్వంసమైన విగ్రహం



ఆందోళన చేస్తున్న దిమ్మదుర్తి గ్రామస్తులు

మామడ: మండలంలోని దిమ్మదుర్తి గ్రామంలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేశారు. విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని వెంటనే గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, అంబేద్కర్ సంఘం నాయకులు నిర్మల్ – ఖానాపూర్ రహదారిపై శనివారం రాస్తారోకో నిర్వహించారు. విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. విగ్రహం ధ్వంసం చేసిన వారిని పట్టుకుని చర్యలు తీసుకుంటామని సీఐ నవీన్‌కుమార్, లక్ష్మణచాంద ఎస్సై శ్రీకాంత్ తెలుపడంతో ఆందోళన విరమించారు.

కాంగ్రెస్‌లో 'విజయభేరి' జోష్

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: కాంగ్రెస్ పార్టీలో 'విజయభేరి' సమరోత్సాహం నాయకుల్లో మొదలైంది. ఆదివారం రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు ఉమ్మడి జిల్లా నుంచి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులను తరలించేందుకు సన్నద్ధం చేశారు. వచ్చే ఎన్నికల్లో ఆయా ప్రాంతాల్లో తమ సత్తా చాటేందుకు 'హస్తం' పార్టీ నేతలు ఆరాట పడుతున్నారు. పీసీసీ వ్యూహ కమిటీ చైర్మన్, మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి, ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాల నుంచి భారీగా సభకు తరలించేందుకు సన్నద్ధం చేశారు. టికెట్ ఆశిస్తున్న ఆశావహులు సైతం తమ నియోజకవర్గాల నుంచి తమ వంతుగా జనసమీకరణ చేస్తున్నారు. సమన్వయకర్తలు విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నారు. ఒక్కో నాయకుడు ఎన్ని వాహనాల్లో సభకు తరలి వస్తున్నారనేది పక్కాగా తీసుకుని సమన్వయం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ఇంద్రవెల్లిలో బహిరంగసభ, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క పాదయాత్ర, ఆ తర్వాత మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేతో భారీ సభ నిర్వహించగా వరుసగా సక్సెస్ అయ్యాయి. తాజాగా రాష్ట్ర రాజధాని శివారులో జరుగుతున్న 'విజయభేరి'ని సైతం 'హస్తం' పార్టీ నాయకులు సక్సస్ చేసేందుకు జనసమీకరణ చేశారు. ఆదివారం ఉదయమే జిల్లా నంచి తరలించేందుకు బస్సులు, కార్లు, రైళ్లగుండా కార్యకర్తలు, అభిమానులను తీసుకెళ్లేందుకు ఏర్పాట్లు చేశారు.

మంత్రి ఐకేరెడ్డిని అడ్డుకున్న అంగన్‌వాడీలు

- సీఎం దృష్టికి తీసుకెళ్తానని హామీ



కాన్వాయ్ ఎదుట బైఠాయించిన అంగన్‌వాడీలు

కైలాస్‌నగర్: తమ సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్‌తో ఆరు రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు శనివారం రాష్ట్ర అటవీశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి కాన్వాయ్‌ని అడ్డుకున్నారు. కలెక్టరేట్ ఎదుట సమ్మె శిబిరం నుంచి ఆదిలాబాద్ అర్బన్ సీడీపీవో కార్యాలయం ఎదుట ధర్నా చేసేందుకు అంగన్‌వాడీలు ర్యాలీగా బయలుదేరి వెళ్లారు. డీసీఎంఎస్ కార్యాలయ ప్రారంభోత్సవానికి మంత్రి హాజరవుతుండటాన్ని గమనించిన అంగన్‌వాడీలు కలెక్టర్ చౌక్‌లో అడ్డుకున్నారు. కాన్వాయ్ ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. దీంతో మంత్రి వాహనాన్ని దిగి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉద్యోగ భద్రతను కల్పించాలని, కనీస వేతనాన్ని చెల్లించాలని కోరుతూ మంత్రికి వినతిపత్రం అందజేశారు. సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

22న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

నిర్మల్‌రూరల్: జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు ఈ నెల 22న నర్సాపూర్ (జి) మండల కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కిషన్‌రావు, వ్యాయామ ఉపాధ్యాయుడు దేవేందర్ శనివారం తెలిపారు. స్కూల్ గేమ్స్ విభాగంలో అండర్ 14, 17, అండర్ 16, 18 ,20 విభాగంలో ఎంపిక ఉంటుందని, వివరాలకు 9440516634 సంప్రదించాలని సూచించారు.

చేపల వేటకెళ్లి ఒకరి మృతి

లోకేశ్వరం: మండల కేంద్రానికి చెందిన సాథ్గాం పోశెట్టి(52) మత్స్యకారుడు లోకేశ్వరం భగీరథ చెరువులో చేపల వేటకెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. ఏఎస్సై దిగంబర్ వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ముగ్గురు జాలర్లు ఎప్పటిలాగే లోకేశ్వరం భగీరథ చెరువులోకి శనివారం చేపల వేటకు వెళ్లారు. పోశెట్టి తెప్ప నుంచి చెరువులో వలను వేసే క్రమంలో ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతిచెందాడు. మృతుడికి భార్య ముత్తవ్వ, ఇద్దరు కుమార్తెలు కల్పన, కవిత, కుమారుడు ప్రశాంత్ ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

తాగుడికి బానిసై ఆత్మహత్య

బజార్‌హత్నూర్: మద్యం మత్తులో ఉరేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్సై నరేశ్ వివరాల ప్రకారం... మండల కేంద్రానికి చెందిన అరుగుల గంగయ్య(50) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం మనవరాలి పుట్టింటి కల కార్యక్రమం ఉండడంతో బంధువులు వస్తారని, మద్యం తాగొద్దని కుటుంబ సభ్యులు తెలిపారు. అయినప్పటికీ శనివారం మద్యం తాగడంతో మందలించారు. దీంతో మనస్తాపానికి గురై మద్యం మత్తులో గ్రామ శివారులోని చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

ఉరేసుకుని ఒకరు..

ఉట్నూర్‌రూరల్: జీవితంపై విరక్తితో ఉరేసుకుని ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం మండలంలో చోటుచేసుకుంది. ఏఎస్సై దిలీప్‌కుమార్ వివరాల ప్రకారం... మండలంలోని హర్కాపూర్ గ్రామానికి చెందిన సీపెల్లి రాజేశ్వర్ (48) నార్నూర్ ఎస్‌బీఐ బ్యాంక్‌లో రికార్డు అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఆరు నెలల క్రితం అతడి భార్య లక్ష్మి గుండెపోటుతో మృతిచెందింది. భార్య మృతితో మానసికంగా బాధపడుతున్నాడు. శనివారం ఉదయం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుమారుడు రాజ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి

నేరడిగొండ: మండలంలోని కుప్టీ జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతిచెందిన ఘటన శనివారం చోటుచేసుకుంది. ఎస్సై సాయన్న వివరాల ప్రకారం... మండలంలోని వాగ్ధారి గ్రామానికి చెందిన చౌహాన్ అరవింద్ (23) భార్యతో కలిసి ద్విచక్ర వాహనంపై కుప్టి గ్రామ శివారు ప్రాంతంలోని వ్యవసాయ క్షేత్రానికి వెళ్లాడు. అక్కడ తన భార్యను వదిలి వ్యవసాయ క్షేత్రంలోని సోలార్ పనిచేయకపోవడంతో దాని మరమ్మతు చేయించి వ్యవసాయ క్షేత్రానికి తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో కుప్టి జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో ఆయన సంఘటన స్థలంలోనే మృతిచెందాడు. కాగా సంఘటనా స్థలానికి ఎస్సై సాయన్న చేరుకుని వివరాలు సేకరించారు. పోస్టుమార్టం అనంతరం శవాన్ని కుటుంబీకులకు అప్పగించారు. మృతుడికి తల్లిదండ్రులతో పాటు నలుగురు అక్కచెల్లెళ్లు, భార్య ఉన్నారు. ఇటీవల వివాహమైంది. అయితే ఇలా రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో ఆయా కుటుంబాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

యువకుడి అదృశ్యం

ఖానాపూర్: మండలంలోని సుర్జాపూర్ గ్రామానికి చెందిన యువకుడు గండె యోగేష్ అదృశ్యమైన ట్లు ఎస్సై ఆర్.శంకర్ తెలిపారు. శుక్రవా రం రాత్రి 8.30 గంటలకు ఇంటి నుంచి వాకింగ్ వెళ్లి శనివారం వర కు తిరిగి రాలేదు. దీంతో అతడి తండ్రి సాంబయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

డెంగీతో ఇద్దరు మృతి



చందర్ (ఫైల్)



శేఖర్(ఫైల్)

దిలావర్‌పూర్/కడెం: నిర్మల్ జిల్లాకు చెందిన ఇద్దరు డెంగీతో మృతిచెందారు. దిలావర్‌పూర్ మండలం మాడేగాం గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు ముచ్చింద్ల చందర్(65) మూడు రోజుల క్రితం జ్వరం బారినపడ్డాడు. కుటుంబ సభ్యులు శుక్రవారం రాత్రి నిర్మల్‌కు తరలించారు. వైద్యుల సూచన మేరకు హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. కడెం మండలం పాత మద్దిపడగ గ్రామానికి చెందిన కర్కాల శేఖర్(33) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల డెంగీ జ్వరం బారిన పడడంతో స్థానికంగా చికిత్స తీసుకున్నాడు. ఆరోగ్యం కుదుట పడకపోవడంతో శుక్రవారం నిర్మల్‌లోని ఆస్పత్రికి వెళ్లాడు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం ఉదయం మృతిచెందాడు. మృతుడికి భార్య రేవతి, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.